క్లుప్తంగా

రేపు ఉచిత కంటి వైద్య శిబిరం

గాలివీడు : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో తిరుపతికి చెందిన శ్రీ వేంకటేశ్వర అరవింద్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు ఉచిత కంటి వైద్య శిబిరాన్ని గాలివీడు గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. దూరం, దగ్గర చూపు సమస్యకు ఉచిత పరీక్షలు నిర్వహించి, కంటి అద్దాలను పంపిణీ చేస్తామన్నారు. పొర, శుక్లాలు ఉన్న వారికి తిరుపతి అరవింద్ కంటి ఆసుపత్రికి తరలించి భోజనం, వసతి సౌకర్యాన్ని కల్పించి ఉచిత కంటి చికిత్స చేయిస్తామన్నారు. కంటి సమస్యలు ఉన్న ప్రతి ఒక్కరూ ఉచిత కంటి వైద్య శిబిరం సేవలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వైద్య శిబిరాన్ని వచ్చు వారు తమ వెంట ఆధార్‌కార్డు తప్పనిసరిగా తెచ్చుకోవాలని నిర్వాహకులు సూచించారు.

గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఓబులవారిపల్లె : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల సంజీవపురంలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ షేక్ మన్సూర్ అలీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో 6 నుంచి 8వ తరగతుల వరకు ఖాళీలు ఉన్నాయన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థుల తల్లిదండ్రులు స్థానిక కళాశాలలో ఈనెల 22వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. విద్యార్థులు దరఖాస్తు చేసుకునేందుకు విద్యార్థి ఆధార్ కార్డు, స్టడీ సర్టిఫికెట్ పత్రాలను కళాశాలకు తీసుకురావాలన్నారు.

ప్రమాద నివారణ పరికరాల పంపిణీ



పరికరాలను అందజేస్తున్న డీఈఈ చంద్రశేఖర్‌రెడ్డి

రాయచోటి అర్బన్ : విద్యుత్ సంస్థలో పనిచేసే జేఎల్‌ఎంల కోసం ప్రమాద నివారణా పరికరాలను శుక్రవారం రాయచోటి డివిజన్ రూరల్ సెక్షన్ ఏఈ నరేష్ డీఈఈ చేతులమీదుగా పంపిణీ చేయించారు. 2013లో ఉత్తరాఖండ్‌లో సంభవించిన వరదలో నరేష్ కుటుంబీకులు ప్రాణాలు కోల్పోయారన్నారు. వారి జ్ఞాపకార్థం నరేష్ రాయచోటి డివిజన్ పరిధిలో పనిచేస్తున్న 35 మంది జేఎల్‌ఎంలకు ఉద్యోగరీత్యా సంభవించే ప్రమాదాల నుంచి రక్షించుకునే విధంగా ఉండే రక్షణ పరికరాలను అందజేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఈఈ తిరుపాల్‌నాయక్, ఏఈ నరేంద్రనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

సిద్దవటం : సిద్దవటం మండల తహసీల్దారుగా బి.లక్ష్మీదేవి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. సిద్దవటం తహసీల్దారుగా పనిచేసిన శంకర్‌రావు వల్లూరుకు బదిలీ కావడంతో సిద్దవటం డిప్యూటీ తహసీల్దారు రాజేష్‌క్రిష్ణ ఇన్‌చార్జి తహసీల్దారుగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఎర్రగుంట్లలో డిప్యూటీ తహసీల్దారుగా పనిచేస్తున్న లక్ష్మీదేవి పదోన్నతిపై సిద్దవటం తహసీల్దారుగా వచ్చారు.

పంచాయతీ కార్యదర్శిగా రాజేంద్రప్రసాద్‌రెడ్డి..

నందలూరు(రాజంపేట) : నియోజకవర్గంలోని నాగిరెడ్డిపల్లె మేజర్ పంచాయతీ కార్యదర్శిగా రాజేంద్రప్రసాద్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక సచివాలయం(అరవపల్లె)లో బాధ్యతలు స్వీకరించారు. దువ్వూరు మండలం మాచనపల్లె పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తూ, నాగిరెడ్డిపల్లె మేజర్ పంచాయతీకి బదిలీపై వచ్చారు. ఇక్కడ కార్యదర్శిగా పనిచేస్తున్న ప్రసాద్‌ను చిట్వేలికి బదిలీ చేశారు. నూతనంగా బాధ్యతలు తీసుకున్న కార్యదర్శి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ పంచాయతీ పరంగా ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

లక్కిరెడ్డిపల్లె : లక్కిరెడ్డిపల్లె బాలికోన్నత పాఠశాల నుంచి బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులు రెడ్డమ్మ, శ్రీలక్ష్మి, ప్రసన్న లక్ష్మి, శ్రీవల్లిలను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జగన్మోహిని దేవి, పాఠశాల కమిటీ చైర్మన్ యలంకూరి లక్ష్మిరాజ్యంలు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో విద్యార్థులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఐసీడీఎస్‌ను నిర్వీర్యం చేస్తున్న బీజేపీ ప్రభుత్వం

కడప సెవెన్‌రోడ్స్ : ఎన్నికల సమయంలో అంగన్వాడీలకు బీజేపీ ఇచ్చిన హామీలు అమలు చేయకపోగా, ఐసీడీఎస్‌ను నిర్వీర్యం చేస్తోందని సీఐటీయూ రాష్ట్ర నాయకులు రామభూపాల్ విమర్శించారు. శుక్రవారం జెడ్పీ సభాభవనంలో ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర స్థాయి శిక్షణా తరగతులకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జాతీయ నూతన విద్యా విధానంలో లోపాలను సవరించాలన్నారు. ఐక్య పోరాటాలు ఉధృతం చేయడం ద్వారానే సమస్యలు పరిష్కారమవుతాయని చెప్పారు. ఐసీడీఎస్‌కు కేంద్ర బడ్జెట్‌లో నిధులు తగ్గించడం దారుణమని ధ్వజమెత్తారు. ఐసీడీఎస్‌ను ప్రైవేటు సంస్థలకు అప్పగిస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. ఈ శిక్షణా తరగతుల్లో ఆ యూనియన్ రాష్ట్ర నాయకులు సుప్రజ తదితరులున్నారు.

స్ఫూర్తి నింపేందుకే 'జగనన్న ఆణిముత్యాలు'

- ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు నగదు పంపిణీ
- పాల్గొన్న ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు



విద్యార్థుల తల్లితండ్రులకు నగదు ప్రోత్సాహకాన్ని అందిస్తున్న ప్రభుత్వవిప్ కొరముట్ల



డీఎస్పీ చైతన్యతో సమీక్షిస్తున్న కొరముట్ల

రైల్వేకోడూరు : విద్యార్థుల్లో స్ఫూర్తి నింపిందుకే జగనన్న ఆణిముత్యాలు పేరుతో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు నగదు పారితోషికాలు అందించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా రైల్వేకోడూరు నియోజకవర్గ స్థాయిలో ఈ ఏడాది పదోతరగతి, ఇంటర్‌లో టాపర్లుగా నిలిచిన విద్యార్థులకు నగదు పురస్కారాలు అందించే జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమాన్ని కె.బుడుగుంటపల్లె పంచాయతీలోని ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా కొరముట్ల మాట్లాడుతూ ప్రభుతత్వంవిద్యకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ఇందులో భాగంగానే నాడు–నేడుతో సదుపాయాలు కల్పించామన్నారు. రాష్ట్రంలో 6వ తరగతి నుంచే విద్యార్థులకు డిజిటల్ విద్యను అందిస్తున్నామని, దీనిలో భాగంగా అన్ని పాఠశాలల్లో ఇంటరాక్టివ్ లెర్నింగ్ విధానాన్ని ప్రవేశపెడుతున్నట్టు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్ని కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా రూపొందించడంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న కృషికి ఉపాధ్యాయులు తోడ్పాటు అందిస్తున్నారని తెలిపారు. సదుపాయాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు విద్యలో బాగా రాణించాలన్నారు. ప్రతి విద్యార్థి పాఠశాల దశ నుంచే జీవితంలో తాను నిర్దేశించుకున్న ఉన్నత లక్ష్యాలను సాధించేందుకు ముందుకు సాగాలన్నారు. రాష్ట్రంలో పాఠశాలలకు వచ్చే పిల్లలకు విద్యాకానుక కిట్లను అందించడంతోపాటు పాఠశాలలో వసతులు, పౌష్టికాహారాన్ని ప్రభుత్వం అందిస్తోందన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న విద్యార్థుల ఫలితాలను మెరుగుపరచడం, వారిని భావి ప్రపంచ పౌరులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో అద్భుతమైన సౌకర్యాలను కల్పిస్తున్నామన్నారు. పాఠశాలలకు వెళ్ళే పిల్లల తల్లుల ఆర్థిక కష్టాలను తీర్చేందుకు జగనన్న అమ్మ ఒడి పథకం అమలు చేస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యా సంస్కరణలు ఏ రాష్ట్రంలోనూ లేవని, జగనన్న ఆణిముత్యాలు పేరిట విద్యార్థులను సత్కరించడం గొప్ప విషయం అన్నారు. టాప్ స్కోర్‌లలో సమాన మార్కులు ఎంతమంది సాధించిన వారందరినీ సత్కరిస్తామని తెలియజేశారు. అంతకుముందు నియోజకవర్గ స్థాయిలో పదోతరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన మొదటి నలుగురు విద్యార్థులకు, ఇంటర్‌లో ప్రతిభ చాటిన మొదటి నలుగురు విద్యార్థులు, వారి తల్లిదండ్రులను సత్కరించి నగదు, గోల్డ్‌మెడల్, మెమెంటోలను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, సర్పంచ్ చంద్రశేఖర్, ఉప సర్పంచ్ యజ్ఞం చంద్రశేఖర్, ఎంఈవో రామయ్య, ప్రధానోపాధ్యాయులు మహేశ్వర్‌రావు, జిల్లా కోఆప్షన్ సభ్యులు వైఎస్ అన్వర్‌బాషా, గుంటిమడుగు సుధాకర్‌రాజు, సిహెచ్.రమేష్, బత్తిన గంగయ్య, బత్తల సుబ్రమణ్యం, బండారు మల్లి, దామర్ల సిద్దయ్య, రక్కాసి చంగల్‌రెడ్డి, అశోక్, శివయ్య, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నియామక పత్రాల పంపిణీ

రైల్వేకోడూరు పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం 13 మంది నూతనంగా ఎంపికైనా అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లకు ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేశారు.

రోడ్డు ప్రమాదాలపై డీఎస్పీతో సమీక్ష

పట్టణంలో నిత్యం జరుగుతున్న రోడ్డు ప్రమాదాల దృష్ట్యా శుక్రవారం పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో రాజంపేట డీఎస్పీ వీఎన్‌కె చైతన్యతో ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు సమీక్షా సమావేశం నిర్వహించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పించడం, ప్రాణాపాయస్థితి నుంచి రక్షణ పొందే పలు అంశాలపై చర్చించారు. అనంతరం టోల్‌గేట్ వద్ద వైస్ ఎంపీపీ ధ్వజారెడ్డి సొంత డబ్బుతో నిర్మించిన బస్‌షెల్టర్‌ను, చిట్వేలి రోడ్డులో ఉప సర్పంచ్ తోట సాయి సొంత నిధులతో నిర్మించిన బస్‌షెల్టర్, ఆటోస్టాండ్‌లు, బస్‌స్టాండ్‌లను పరిశీలించి రోడ్డు ప్రమాదాలు, ట్రాఫిక్ సమస్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో చిట్వేలి మండల కన్వీనరు చెవ్వు శ్రీనివాసులు, ఏపీటీడీసీ డైరెక్టర్ మందల నాగేంద్ర, జిల్లా టూరిజం డైరెక్టర్ సుధాకర్ రాజు, స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ ముజీబ్, రాష్ట్ర ప్రచార కార్యదర్శి సీడీ నాగేంద్ర, సర్పంచ్ శివయ్య, ఉప సర్పంచ్ తోట సాయి, పట్టణ కన్వీనర్ సీహెచ్.రమేష్, సిద్దయ్య, రమణ, ఆర్టీసీ డీఎం రమణయ్య, సీఐ విశ్వనాథరెడ్డి, ఎస్ఐ మోహన్‌కుమార్‌గౌడ్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి ఉన్నత స్థానంలో ఉండాలి

రైల్వేకోడూరు అర్బన్ : భవిష్యత్తులో ప్రతి విద్యార్థి ఉన్నత శిఖరాలకు చేరాలని గురువారం వైఎస్సార్సీపీ రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి ముక్కా సాయివికాస్ రెడ్డి తెలిపారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఫెయిర్ వెల్ ఫంక్షన్‌కు ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరాలంటే ప్రతి ఒక్కరూ చదువులలో రాణించాలన్నారు. అధ్యాపకులు తెలిపే ప్రతి విషయం మన భవిష్యత్‌కు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఇప్పటి నుంచి తన లక్ష్యాలను నిర్దేశించుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. డీఆర్‌యూసీసీ బోర్డు మెంబర్ తల్లెం భరత్‌కుమార్ రెడ్డి, బత్తిన వేణుగోపాల్‌రెడ్డి, టి.విష్ణుకుమార్‌రెడ్డి, సర్పంచ్ అరవ శ్రీధర్, రమణ, రాజు పాల్గొన్నారు.

జగనన్న విద్యాకానుక పంపిణీ



విద్యాకానుకను అందజేస్తున్న సర్పంచ్ సూర్యనారాయణ

నందలూరు(రాజంపేట) : పేద విద్యార్థులకు వరం జగనన్న విద్యాకానుక అని నాగిరెడ్డిపల్లె అర్బన్ సర్పంచి జంబుసూర్యనారాయణ అన్నారు. శుక్రవారం అరవపల్లెలోని మండల ప్రాథమిక పాఠశాలలో జగనన్న విద్యాకానుకను పంపిణీ చేశారు.

అంకితభావంతో పనిచేస్తే పేరు ప్రఖ్యాతులు



రేంజర్ ప్రసాద్‌ను సన్మానించిన డీఎఫ్ఓ సందీప్‌రెడ్డి

సిద్దవటం : విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసినప్పుడే మంచి పేరు ప్రఖ్యాతులు పొందవచ్చని కడప డీఎఫ్ఓ సందీప్‌రెడ్డి అన్నారు. సిద్దవటం ఫారెస్టు రేంజర్ ప్రసాద్ బదిలీపై కడపకు వెళ్లడంతో శుక్రవారం అటవీశాఖ కార్యాలయంలో ఆయనకు సన్మాన సభ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కడప డీఎఫ్ఓ సందీప్‌రెడ్డి మాట్లాడుతూ రేంజర్ ప్రసాద్ చేసిన సేవలు మరువలేనివన్నారు. ఆయన ఉన్నతాధికారులు, సిబ్బంది, ప్రజల్లో మంచి పేరు తెచ్చుకున్నారని తెలిపారు. ఆయన అటవీ సంపద తరలిపోకుండా గట్టి చర్యలు చేపట్టారన్నారు. అనంతరం బదిలీపై కడపకు వెళ్లిన రేంజర్ ప్రసాద్‌ను డీఎఫ్ఓ సందీప్‌రెడ్డి శాలువా కప్పి పూలమాలతో సన్మానించి జ్ఞాపికను అందజేశారు. అదే విధంగా సిద్దవటం అటవీశాఖ సిబ్బంది, సప్తగిరి పర్యావరణ పరిరక్షణ సమితి అధ్యక్షుడు లక్ష్మిరెడ్డి ప్రసాద్‌ను సన్మానించారు. కార్యక్రమంలో వేంపల్లి ఎఫ్ఆర్ఓ సుబ్రమణ్యం, ఒంటిమిట్ట ట్రైనీ ఎఫ్ఆర్ఓ ప్రణీత, డీఆర్ఓ ఓబులేస్, ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ సురేష్‌బాబు, షకీల్ అహ్మద్, ఎఫ్‌బీఓలు, ఏబీఓలు, అటవీశాఖ సిబ్బంది, ప్రొటక్షన్ వాచ్చర్‌లు, బేస్ క్యాంప్ సిబ్బంది, మునెయ్య, స్థానికులు ఓబులయ్య, నాగరాజు, బాబి, మునిస్వామి తదితరులు పాల్గొన్నారు.

సూచిక ఫ్లెక్సీల అందజేత

రామాపురం : లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ ఆధ్వర్యంలో ఆది డెంటల్ కేర్ వైద్యుడు డా.ఆదినారాయణరెడ్డి ఆర్థిక సౌజన్యంతో మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌కు ట్రాఫిక్ నియమ నిబంధనలకు సంబంధించిన ఫ్లెక్సీలను సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వరప్రసాద్, ఎస్ఐ కొండారెడ్డిలకు శుక్రవారం అధ్యక్షుడు మహమ్మద్ అందించారు.

ఎంపీపీపై దాడి చేసిన వారిని శిక్షించాలి

లక్కిరెడ్డిపల్లె : కాకినాడ జిల్లా రౌతులపూడి మండలానికి చెందిన ఎంపీపీ విజయలక్ష్మిపై దాడికి పాల్పడిన గిరిజన నేతలపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని, ఈ దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నమయ్య జిల్లా ఎంపీపీల సంఘం అధ్యక్షుడు సుదర్శన్ రెడ్డి చెప్పారు. గిరిజన మహిళా ఎంపీపీ విజయలక్ష్మి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారని, పీహెచ్‌సీ ప్రారంభోత్సవానికి ఆమెను ఆహ్వానించకపోగా ప్రశ్నించినందుకు ఎంపీపీ విజయలక్ష్మిపై దాడికి పాల్పడటం ఎంతవరకు సమంజసమని సుదర్శన్ రెడ్డి ప్రశ్నించారు. ఈ దాడికి తీవ్రంగా ఖండిస్తున్నామని తెలియజేశారు.

సాంకేతిక పరిజ్ఞానంతో అధిక దిగుబడులు



పండ్ల మొక్కలను అందజేస్తున్న ఉద్యాన కళాశాల శాస్త్రవేత్తలు, సర్పంచ్ ఈశ్వరయ్య

ఓబులవారిపల్లె : శాస్త్రవేత్తలు అందించిన సాంకేతిక పరిజ్ఞానాన్ని పాటించడంతో అధిక దిగుబడులు పొందవచ్చని వైఎస్సార్ ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ కె.గోపాల్ పేర్కొన్నారు. శుక్రవారం వైఎస్సార్ ఉద్యాన కళాశాల దత్తత గ్రామమైన వైకోట గ్రామంలో రైతులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేట్ డీన్ మాట్లాడుతూ వైకోటలో ప్రత్యామ్నాయ పంటలు, ఔషధ మొక్కలు గురించి రైతులకు అవగాహన కల్పించామన్నారు. అలాగే అనేక రకాల మొక్కల సాగుపై వివరించినట్టు తెలిపారు. అత్యాధునిక సస్యరక్షణ మందులు, సాంకేతిక సలహాలను రైతులకు తెలియజేశారు. అనంతరం వైఎస్సార్ ఉద్యాన కళాశాల విద్యార్థులు ఏర్పాటు చేసిన ప్రదర్శన రైతులను ఆకట్టుకుంది. ఇందులో మామిడి రకాలు, ఉద్యాన పంచాంగం, పండు ఈగ, ఎర్రలు, ట్రైకో ధర్మ విరిడీపై రైతులకు అవగాహన కల్పించారు. సర్పంచ్ మల్లెం ఈశ్వరయ్య మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటాలని సూచించారు. ఇందుకు గ్రామంలోని ప్రతి ఇంటికి ఒక పండు మొక్కను అందజేశారు. మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కె.మమత, అధ్యాపకులు డాక్టర్ కె.స్వరాజ్యలక్ష్మి, డాక్టర్ సీహెచ్ రూత్, డాక్టర్ నిశ్చల, డాక్టర్ వీరేష్, డాక్టర్ వినోద్, డాక్టర్ తులసీరామిరెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

నేడు వీహెచ్‌పీ సమావేశం

రామాపురం : మండల కేంద్రంలోని హరిహర దేవాలయంలో శనివారం ఉదయం 9గంటలకు విశ్వహిందూ పరిషత్ నెలవారీ సమావేశం ఉంటుందని లక్కిరెడ్డిపల్లె ప్రముఖ్ ఎస్ఆర్ అంజిరెడ్డి తెలిపారు. జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, ఇతర ప్రముఖులు హాజరవుతున్నారన్నారు. వీహెచ్‌పీలో సేవా భావంతో పనిచేసేందుకు ఆసక్తి ఉన్న లక్కిరెడ్డిపల్లె, గాలివీడు, రామాపురం మండలంలోని హిందువులందరూ హాజరవ్వాలన్నారు.

కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి



ప్రదర్శన చేస్తున్న ఏఐటీయూసీ నేతలు, కార్మికులు

రాయచోటి అర్బన్ : భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి ఉద్దేశించిన కార్మిక సంక్షేమ బోర్డును ప్రభుత్వం వెంటనే పునరుద్ధరించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్దిగాళ్ల శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఈనెల 20న విజయవాడలో నిర్వహించనున్న భవన నిర్మాణ కార్మికుల మహాధర్నాపై కార్మికులు శుక్రవారం పట్టణంలో విస్తృతంగా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవన నిర్మాణ రంగంలో పనిచేసే తాపీ మేస్త్రీలు, సెంట్రింగ్, రాడ్ బెండర్, కార్పెంటర్, ఎలక్ట్రీషియన్, పెయింటర్స్, ప్లంబింగ్, మార్బుల్, టైల్స్ కాంక్రీట్, మట్టిపని కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం వెంటనే కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలంటూ కోరారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం పట్ల పాలకుల నిర్లక్ష్య వైఖరిని నిరసనగా విజయవాడలో జరిగే మహాధర్నాకు కార్మికులంతా పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయాలంటూ వారు పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ పట్టణకార్యదర్శి వై.పుల్లయ్య, భవన నిర్మాణ సంఘం సీనియర్ నేత పలమనేరు వెంకటేష్, నేతలు వెంకటసుబ్బయ్య, వెంకటరమణ, హుస్సేన్, గంగాధర్, శివయ్య, గంగయ్య తోపాటు పలువురు కార్మికులు పాల్గొన్నారు.

మహిళలకు రక్షణగా దిశ యాప్



దిశ యాప్‌పై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ రమేష్‌బాబు

చిన్నమండెం : దిశ యాప్ మహిళలకు ఎంతో రక్షణగా ఉంటుందని చిన్నమండెం ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని ప్రధాన కూడళ్లలో దిశ యాప్‌పై మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ రమేష్‌బాబు మాట్లాడుతూ ఆండ్రాయిడ్ ఫోన్లు కలిగిన ప్రతి మహిళ దిశ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. ఇంటర్నెట్ ఉన్నా లేకున్నా ఈ యాప్ పనిచేసే విధంగా ప్రభుత్వం ఈ యాప్‌ను రూపొందించిందన్నారు. ప్రతి మహిళ తమ మొబైల్‌లో యాప్‌ను ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, పలువురు మహిళలు పాల్గొన్నారు.

తాగునీటి కోసం గ్రామస్తుల పాట్లు



నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ నాయకులు, గ్రామస్తులు

ఓబులవారిపల్లె : మండలంలోని గోవిందంపల్లి పంచాయతీ శంకరాపురం దళితవాడ గ్రామంలో తాగునీరు అందక ప్రజలు రెండు నెలలుగా ఇబ్బందులు పడుతున్నారు. శుక్రవారం సీపీఐ మండల కార్యదర్శి సి.నాగమ్మ, కార్యకర్తలు, గ్రామస్తులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామంలో తాగునీటి బోరు మరమ్మతులకు గురికాగా స్థానిక సర్పంచ్ చొరవతో మరమ్మతులు చేయించారన్నారు. అయితే విద్యుత్ సమస్య వలన గ్రామంలో తాగునీరు బోరు పనిచేయక నీటి కోసం ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. వెంటనే సంబంధిత విద్యుత్‌శాఖ అధికారులు స్పందించి బోరువద్ద విద్యుత్ మరమ్మతులు చేయించి తాగునీటి సమస్యను పరిష్కరించాలన్నారు.

యాజమాన్య పద్ధతులపై రైతులకు శిక్షణ

రామాపురం : మామిడి రైతులకు సస్యరక్షణ సమగ్ర యాజమాన్య పద్ధతులపై శుక్రవారం మామిడి రైతులకు ఉద్యాన శాఖ అధికారి నాగమణి శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. మండలంలోని సుద్దమళ్ల, నల్లగుట్టపల్లె గ్రామాల రైతులకు మామిడి పంటలో కాయల కోత తరువాత ఆచరించాల్సిన సస్యరక్షణ సమగ్ర యాజమాన్య పద్ధతులపై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మామిడికాయలు కోసినప్పటి నుంచి తగు జాగ్రత్తలు పాటిస్తే నాణ్యతతో కూడిన దిగుబడి పొందవచ్చునన్నారు. కోత కోసిన 15–20 రోజులు చెట్లకు విశ్రాంతి ఇచ్చిన తరువాత కొమ్మ కత్తిరింపులు చేయాలన్నారు. కత్తిరింపులు చేసిన వెంటనే కోసిన కొమ్మ భాగానికి చెట్టు పూర్తిగా తడిచేల 3 గ్రాముల కాపర్ ఆక్సిక్లోరైడ్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని వివరించారు. తొలకరి వర్షాలు పడగానే వాలుకు అడ్డంగా దున్నాలని, దున్నులు చేపట్టడం ద్వారా వర్షపు నీరు భూమిలో ఇంకి తేమశాతం పెంచడం జరుగుతుందన్నారు. 10 సంవత్సరాలు పైబడిన చెట్లకు వర్షాధారం తోటలో ప్రతి చెట్టుకు 2కిలోల యూరియా, 5కిలోల సూపర్ పాస్పేట్ , 1.5 కిలోల మ్యూరెట్ ఆఫ్ పొటాష్ వేయాలి, నీటి వసతి కలిగిన తోటలో 1కిలో యూరియా, 5కిలోల సూపర్ పాస్పేట్, 750 గ్రాముల మ్యూరెట్ ఆఫ్ పొటాష్ వేయాలన్నారు. పిందెలు గోలి సైజులో ఉన్నప్పుడే మిగతా 1కిలో యూరియా 750 గ్రాములు మ్యూరెట్ ఆఫ్ పొటాష్ వేయాలని సూచించారు. జింక్, బోరాన్ ధాతువుల లోపాలను నివారించడానికి 5 గ్రాముల జింక్ సల్పేట్, 2 గ్రాములు బోరాన్ లీటరు నీటికి లేదా ఫార్ములా – 4 పొడిని లీటరు నీటికి 5 గ్రాములు చొప్పున కలిపి 15 రోజుల వ్యవధిలో 2–3 సార్లు పిచికారీ చేయాలని వివరించారు. ప్రతి మామిడి రైతు డ్రిప్ పద్ధతిని పాటించాలన్నారు. కార్యక్రమంలో రైతు భరోసా కేంద్రం సిబ్బంది ప్రవీణ్‌కుమార్ రెడ్డి, లక్ష్మీదేవి, వీణావాణి, రైతులు పాల్గొన్నారు.

గత ప్రభుత్వం చెల్లించాల్సిన బిల్లులు చెల్లిస్తే ఆరోపణలా?

రాయచోటి టౌన్ : గత ప్రభుత్వం చివరిలో లక్కిరెడ్డిపల్లె మండల పరిధిలోని అనేక గ్రామాలలో తాగునీటి సమస్య తీర్చేందుకు ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా చేసిన వాటికి బిల్లులు వస్తే వాటిపై ఆరోపణలు చేయడం మీకు తగునా రమేష్‌రెడ్డిగారూ.. అంటూ ట్యాంకర్ల యజమానులు ప్రశ్నించారు. శుక్రవారం రాయచోటిలో విలేకర్ల సమావేశంలో ట్యాంకర్ల యజమానులు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2019 సంవత్సరం చివరిలో లక్కిరెడ్డిపల్లె మండలంలో తాగునీటి సమస్య తలెత్తితే ట్యాంకర్లతో నీళ్ల తోలమని చెప్పింది తెలుగుదేశం ప్రభుత్వమేనన్నారు. వారు చెప్పినట్టుగా గ్రామాలకు తాగునీరు సరఫరా చేశాం. అంతలోనే ఎన్నికలు రావడంతో బిల్లులు ఆగిపోయాయి. అప్పటి నుంచి అధికారుల చుట్టూ తిరిగాం. ఎవరూ స్పందించలేదు. చేసిన అప్పులు తీర్చలేక ఇబ్బంది పడుతున్నామని అధికారులకు చెప్పగా వారు స్పందించి మాకు బిల్లులు వచ్చేలా చేస్తున్నారు. దీనిపై టీడీపీ ఇన్‌చార్జి రమేష్‌రెడ్డి మాపై తప్పుడు ప్రచారం చేయడం నీళ్ల తోలకపోయినా బిల్లులు చెల్లిస్తున్నారని అసత్య ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. రాయచోటి నియోజకవర్గ పరిధిలోని ప్రధానంగా మీ సొంత మండలంలో మీ అనుచరులకే చెందినవే ఎక్కువ బిల్లులు ఉన్నాయనే విషయం మరిచిపోయారాని ప్రశ్నించారు. పెండింగ్‌లో ఉన్న రూ.2.53 కోట్లు చెల్లించేందుకు ఈ ప్రభుత్వం చొరవ తీసుకుంటుంటే సంతోషించాల్సింది పోయి విమర్శలు చేయడం మా పొట్టకొట్టే ప్రయత్నమేనని ఇది మీకు తగదన్నారు. ఇప్పటికైనా తప్పుడు ఆరోపణలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో ట్యాంకర్ల యజమానులు వెంకటరమణరెడ్డి, రమణరెడ్డి, రామిరెడ్డి, రెడ్డెయ్య, ఓబయ్య, ధర్మారెడ్డి, గంగిరెడ్డి, రాజారెడ్డి, కృష్ణయ్య, గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ కళాశాలకు దీటుగా ప్రభుత్వ కళాశాలలు

వీరబల్లె (రాయచోటి టౌన్) : ప్రైవేట్ కళాశాలలకు దీటుగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలు రూపుదిద్దుకుంటున్నాయని వీరబల్లె జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ రఘురామయ్య అన్నారు. విద్యార్థులకు కావాల్సిన అన్నిరకాల మౌలిక వసతులు కల్పిస్తున్నామని చెప్పారు. శుక్రవారం విద్యార్థులు ఆడుకోవడానికి కావాల్సిన గ్రౌండ్‌ను చదును చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం కళాశాల 180 మంది విద్యార్థులతో నడుస్తోందన్నారు. నాడు – నేడు కార్యక్రమంలో భాగంగా రూ.35లక్షల ఖర్చు చేసి మౌలిక వసతులు కల్పిస్తున్నామన్నారు. లివింగ్ డయాగ్నస్టిక్ అధినేత గాలివీటి వివేకానందరెడ్డి దాతృత్వంతో రూ.6లక్షల ఖర్చు చేసి క్రికెట్ మైదానం ఏర్పాటు చేశామని చెప్పారు. వైఎస్సార్ సీపీ నాయకులు గాలివీటి వీరనాగిరెడ్డి, మట్లి సర్పంచ్ నాగార్జునాచారి పాల్గొన్నారు.

రైతులకు నష్టపరిహారం అందిస్తాం



రైతులతో మాట్లాడుతున్న ఆర్డీఓ రంగస్వామి

రామాపురం : ఎత్తిపోతల పథకంలో భూ సేకరణలో భూమి కోల్పోయిన రైతులకు నష్టపరిహారం అందిస్తామని రాయచోటి ఆర్డీఓ రంగస్వామి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఎత్తిపోతల పథకంలో భూసేకరణలో భూమి కోల్పోయిన రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలోని కల్పనాయినిచెరువు, గోపగుడిపల్లె, గువ్వలచెరువు, హసనాపురం గ్రామంలో ఎత్తిపోతల పథకం కింద 150 మంది రైతులకు చెందిన 23 ఎకరాలు ఎత్తిపోతల పథకం భూ సేకరణలో సేకరించామన్నారు. భూ సేకరణలో భూమి కోల్పోయిన రైతులకు గ్రామంలో 20 మంది రైతులకు 4.50 ఎకరాలు రూ.5లక్షలు చొప్పున గోపగుడిపల్లి గ్రామంలో 87 మంది రైతులకు గాను 12 ఎకరాలు గువ్వలచెరువు రైతులు 2.18 ఎకరాలు, హసనాపురం 87 మంది రైతులకు సంబంధించి 5 ఎకరాలు, ఈ మూడు గ్రామాల్లో రూ.6 లక్షలు నుంచి రూ7లక్షలు చొప్పున ఎకరాకు నష్టపరిహారం అందే విధంగా జిల్లా అధికారులకు ప్రతిపాదనలు పంపుతామని రైతులకు సూచించారు.